
కరీంనగర్‌లోని ప్రకాశంగంజ్‌లో విద్యుద్దీపాలతో అలంకరణ

నమామి విఘ్నేశ్వర

- నేడు వినాయక చవితి
- మంటప నిర్మాణాలు .. మార్కెట్‌లో సందడి



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 6: ముప్పై మూడు కోట్ల దేవతలకు ముందు గణపతి అని చెప్పుకునే వినా యకునికి సంబంధించిన వినాయక చవితి పండుగను శనివారం జరుపు కోనున్నారు. వినా యక జననం, దేవతా గణాధిపత్యం పొందిన సంద ర్భంగా తొమ్మిది రోజులు ఉత్సవాలు జరిగి నందుకే నవరాత్రులు నిర్వహిస్తారని ప్రతీతి. నవరాత్రుల అనంతరం వినాయక విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేస్తారు.

● పర్వదినాన్ని ఇలా ఆచరించాలి

మట్టి ప్రతిమలు తెచ్చుకొని అభిషేక అర్చనలు నిర్వహిం చాలి. 21 రకాల పత్రితో పూలు, పండ్లు, కుడు ములు, ఉండ్రాళ్లు, వెలగపండు, పాయసం, మక్క వెన్నులు వంటి పదార్థాలు నైవేద్యంగా సమర్పించాలి. గృహాల్లో నవరాత్రులు జరుపలేని వారు సాయంత్రం లేదా మరుసటి రోజు ఉద్వాసన పూజ చేయాలి.

● పెద్ద ఎత్తున మంటప నిర్మాణాలు

జిల్లాలో పెద్ద ఎత్తున మంటప నిర్మాణాలు చేశారు. ప్రధాన కూడళ్ల, ఆలయాల్లో భారీ విగ్రహాలను నెల రోజుల ముందు నుంచే సిద్ధం చేశారు. వివిధ సైజుల్లో అన్ని హంగు లతో, పలు రూపా ల్లో ఉన్న విగ్రహాలు మంటపాలకు తర లించారు. అబ్బురపరిచే సెట్టింగులు వేశారు. తొమ్మిది రోజులు పూజలు, అభిషే కాలు, హోమాలు, అన్నదానాలు, భజ నలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.

● మార్కెట్‌లో సందడి

మార్కెట్‌లో గురువారం నుంచే అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపా రులు జిల్లా కేంద్రానికి వచ్చి పత్రి, విగ్రహాలు, పూలు, పండ్లు, అలంకరణ సామగ్రిని అమ్ముతున్నారు. గజ మాలలు, దండలకు గిరాకీ ఉంది. పూజా సామగ్రి షాపు లు జనంతో కిక్కిరిసి పోతున్నాయి.శుక్రవారం మార్కె ట్‌లో అమ్మకాలు జోరు సాగింది. నగరంలోని పలు ప్రధాన కూడళ్ల, ప్రత్యేక ప్రాంతాల్లో, నగర శివారు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల అమ్మకాలు ఊపందు కున్నాయి. నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేసి వాహనాల్లో మంటపాలకు తరలిస్తున్నారు. అలాగే పలు స్వచ్ఛంద, ధార్మిక, ఆధ్యాత్మిక, సేవా సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.


మార్కెట్‌లో పూజ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు


గణేష్ విగ్రహాలను వాహనంలోకి తరలిస్తున్న యువకులు


మార్కెట్ లో విక్రయిస్తున్న మట్టి విగ్రహం

బల్దియా అధికారులు, ఉద్యోగుల ధర్నా

- టీఎన్‌జీవోస్ నాయకుల సంఘీభావం
- నల్లబ్యాడ్జీలతో నిరసన
- కార్పొరేటర్ భర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు, సంఘీభావం తెలిపిన టీఎన్జీవో నాయకులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 6: విధి నిర్వహణలో ఉన్న నగరపాలక సంస్థ మహిళా అధికారులపై కార్పొ రేటర్ మెండి శ్రీలత భర్త చంద్రశేఖర్ విక్షణ కోల్పోయి దుర్భాషలాడుతూ గొడవకు దిగడం, దౌర్జన్యానికి పాల్పడటాన్ని నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, టీఎన్‌జీవోస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మున్సిపల్ అధికారులపై కార్పొరేటర్ భర్త అనుచితంగా వ్యవహరిస్తూ అధికారులతో గొడవకు దిగడం బాధాకరమని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ ఖండించారు. మున్సిపల్ అధికారులతో గొడవకు దిగి వారి విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయపరమైన విబేధా లను ఉద్యోగులకు రుద్ది దురుసుగా ప్రవర్తించి దాడికి దిగడం శోచనీయమని అన్నారు. ఉద్యోగులపై దాడికి దిగితే సహించేది లేదని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. అడిషనల్ కమిషనర్ సువార్త మాట్లాడుతూ సామరస్యంగా ప్రతి సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మున్సిపల్ ఈఈ రొడ్డ యాదగిరి మాట్లాడుతూ మున్సి పల్ ఉద్యోగులు, కార్మికులు అహర్నిశలు కష్టపడి ప్రజలకు సేవలందిస్తున్నారని, అలాంటి తమపై దాడులు చేయడం, దుర్భాషలా డటం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్‌కమిషనర్ వేణుమాధవ్, టీఎన్‌జీవోస్ పట్టణ అధ్యక్షుడు హర్మిందర్‌సింగ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు గూడ ప్రభాకర్, రాగి శ్రీనివాస్, ఉమెన్ చైర్‌పర్సన్ ఎరుమల్ల శారద, టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు సుమంత్‌రావు, తోట రామస్వామి, శంకరయ్య, కిరణ్‌కు మార్‌రెడ్డి, కరుణాకర్, రాజేశ్వర్‌రావు, వెంకన్న, లవకుమార్, నారాయణ, అజయ్, మంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

- ఆరోగ్య మహిళా కార్యక్రమంలో వైద్య పరీక్షలు
- కలెక్టర్ పమేలా సత్పతి


పోషణ మాస ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 6: ప్రభుత్వ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, మహిళల సమస్యలను పరిష్కరి ంచేందుకు శుక్రవారం సభ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం స్థానిక కోతి రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రాల సమన్వయంతో మహిళా అభివృద్ధి, శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభ, పోషణ మాసం ఉత్సవాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఏమైనా సమస్యలుంటే శుక్ర వారం సభలో విన్నవించుకోవచ్చని, సభ అనంతరం దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ప్రతి మహిళ, గర్భిణి, బాలింత శుక్రవారం సభ కు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది సహా ప్రభుత్వ యంత్రాంగం ఈ సభకు హాజరవుతుందని, దీనితో సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా జిల్లాలోని మహిళలందరికీ రూ.45 వేల విలువ చేసే సుమారు 50 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నామని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మూడునెలలకొకసారి ఆరోగ్య పరీక్ష చేసుకోవడం ద్వారా ప్రాణాంతకమైన వ్యాధులను ముందే గుర్తిస్తే జాగ్రత్త పడవచ్చని అన్నారు. గర్భిణీలకు షుగర్, బీపీతోపాటు లివర్ ఫంక్షన్ టెస్ట్ ఖచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్ష అందుబాటులో ఉంటుందని తెలిపారు. దీన్ని వల్ల మాతృమరణాన్ని నివారించవచ్చని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మేము సైతం చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వైద్యాధికారి డాక్టర్ సుజాత, మెప్మా పీడీ స్వరూపరాణి, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, ఇన్‌చార్జి సిడిపివో రమాదేవి, ప్రభుత్వ డాక్టర్ సాయి ప్రసాద్, మేము సైతం ట్రస్టు నిర్వాహకురాలు చకిలం స్వప్న, కన్న కృష్ణ, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.





సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆర్టిజన్‌ల వినతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 6: ఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమని శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆర్టిజనల్ కార్మికులు జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా జీవనరెడ్డి మాట్లాడుతూ ఆర్టీజన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏపీఈఎస్‌టీ రూల్స్ వర్తింపజేసేలా చొరవ చూపుతానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సీఎం సైతం చొరవచూపుతారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

ఉధృత గోదావరిని దాటలేక..

● తెలంగాణ భూభాగంలో నిలిచిపోయిన మావోయిస్టులు ● ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీసులు, కూంబింగ్‌తో మూల్యం
● 2 నెలలుగా ములుగు, భద్రాద్రి ఏజెన్సీలో లచ్చన్న దళం ● ఈ క్రమంలోనే రఘునాథపాలెం ఘటన

హైదరాబాద్, చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. ఈ క్రమంలోనే భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతోపాటు తెలంగాణలో పట్టు సాధించేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పుడు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు. కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కె సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీస్‌లు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరోవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంత కాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల పోలీస్‌లు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్రనేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపుర్, బీజాపుర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక మావోయిస్టు పార్టీలో ఎన్నడూ లేని విధంగా విభేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

తెలంగాణలో అడుగుపెట్టనివ్వం
- డీజీపీ జితేందర్

తెలంగాణలో మావోయిస్టులకు స్థానం లేదని, రాష్ట్రంలో వారు అడుగు పెట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పునరావాసం, ఆర్థిక సాయంతో సాధారణ జీవితం కొనసాగించాలన్నారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

రుద్రంగి, సెప్టెంబరు 6 : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చలిగటి లక్ష్మి (50) జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన లక్ష్మి వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఇంటి వద్ద చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స పొందింది. అక్కడ ప్లేట్‌లెట్స్ తగ్గడం, పరిస్థితి విష మించడంతో శుక్రవారం సాయంత్రం వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన వెంటనే లక్ష్మి మృతి చెందింది. లక్ష్మికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 6:బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చీపెల్లి మల్లయ్యకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నిందితుడు చీపెల్లి మల్లయ్య డిసెంబరు 25, 2018న మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడని తెలిపారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మల్లయ్యను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రేమలత మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

బాండ్స్ డబ్బులు చెల్లింపుపై హర్షం

భగత్‌నగర్, సెప్టెంబరు 6: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పీఆర్‌సీ- 2013 బాండ్స్ డబ్బులను కండక్టర్స్‌కు చెల్లించడంపై జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో-కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదిలు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. దసరా పండుగకు బాండ్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. దీనితో పాటు గ్యారేజ్‌సిబ్బంది, వర్క్ షాపు సిబ్బంది, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది ఉద్యోగులకు బాండ్ డబ్బులు చెల్లించాలని జేఏసీ పక్షాన డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెట్‌పల్లి, సెప్టెంబరు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్మూర్ రోడ్డులో అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు మహిళను ఢీకొట్టగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పట్టణంలోని డీడీనగర్ కాలనీకి చెందిన నలివేని ఎల్లమ్మ (43) ఈ నెల 2న మెట్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు వెళ్లే రోడ్డులో మనోహర గార్డెన్స్ ఎదుట రాత్రి 10:30 సమయంలో రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మెట్‌పల్లి పోలీసులు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

● తహసీల్దార్, ఎంపీడీవోలకు వెంగళాపూర్ గ్రామస్థుల వినతి

గొల్లపల్లి, సెప్టెంబరు 6: ఇప్పటివరకు స్వచ్ఛంగా ఉన్న తమ గ్రామంలో కొందరు వ్యక్తులు బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మించి గ్రామాన్ని కలుషితం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, రైస్ మిల్లు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దంటూ మండలంలోని వెంగళాపూర్ గ్రామస్థులు తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి ఆయా శాఖల అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇద్దరు, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కలిసి గ్రామానికి పై భాగాన సుమారు 800 మీటర్ల దూరంలో బాయిల్డ్ రైస్‌మిల్లును నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణం సమీపంలో గ్రామానికి చెందిన మంచినీటి బావితో పాటు ప్రాథమిక పాఠశాల ఉందని, దీనివల్ల గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యాలపాలవుతామని భయాందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థుల అభీష్టానికి వ్యతిరేకంగా రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇస్తే ఊరుకునేది లేదని, దేనికైనా తెగిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు గ్రామానికి సహకరించి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని, గ్రామాన్ని కాపాడాలని సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, రాజేందర్, హన్మయ్య పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

కొడిమ్యాల, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం తహసీల్దారు విధులకు ఉదేశ పూర్వకంగా ఆటంకం కలిగించిన అయిత శ్రీనివాస్, అయిత గణేష్‌పై తహసీల్దారు బి. రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... నిందితులు పురుగుల మందు డబ్బాతో కర్రను చూపుతూ తహసీల్దారు డౌన్‌డౌన్ అని స్టిక్కర్లను చూపారన్నారు. తమ భూమిని సర్వే చేయించాలని డిమాండ్ చేశారన్నారు. పురుగుల మందు తాగి మరణిస్తామని ప్రజల సమక్షంలో విధులకు ఆటంకం కలిగించారని తహసీల్దారు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ రాజ్యాధికార సమితి అడ్‌హక్ కమిటీల నియామకం

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్

గణేశ్‌నగర్,సెప్టెంబరు 6: త్వరలో తెలంగాణ రాష్ట్ర బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నియోజకవర్గ, మండల అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు బీసీ రాజ్యాధి కార సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీల సమస్య ల ప్రధాన ఎజెండాగా బీసీ రాజ్యాధికార సమితి నిరంతరం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని బీసీ లకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తుందన్నారు. బీసీల సమస్యల పై పోరాడే నాయకులు ముందుకు వచ్చి బీసీ రాజ్యాధికార సమితిలో పనిచేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థలలో పోటీ చేసే నాయకులు బీసీ రాజ్యాధికారి సమితిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు.

ట్రాన్స్ ఫార్మర్ పైనుంచి పడి లైన్‌మన్‌కు గాయాలు

చందుర్తి, సెప్టెంబరు 6: చందుర్తి మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మ చేస్తున్న లైన్‌మన్ శుక్రవారం పైనుంచి కింద పడడంతో గాయపడ్డాడు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై లైన్‌మన్ కొత్త తిరుపతిరెడ్డి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తిరుపతిరెడ్డికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు.

పందివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

చొప్పదండి, సెప్టెంబరు 6: మండలంలోని ఆర్నకొండ రాగంపేట మధ్యలో ఉన్న పందివాగుపై హైలెవెల్ వంతెనను నిర్మించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్నకొండ నుంచి రాగంపేట వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతి న్నదని చెప్పారు. ఆర్నకొండ గోపాలరావుపేట రోడ్డు ధ్వంసమైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికి సైతం రాగంపేట నుంచి గోపాల్‌రావుపేట వరకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పందివాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	50,350	7,882	80.5	76.894
ఎల్లంపల్లి	15,719	----	20.175	19.202
మిడ్ మానేరు	3,216	6,400	27.54	23.144
ఎల్ఎండీ	11,406	294	24.034	20.268

శ్రీరాంసాగర్‌కు 42,740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జలకళను సంతరించుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి శుక్రవారం ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 76.8 94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర అవసరాలకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు మూసివేత

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు వరద గేట్లను మూసివేశారు. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 15,719 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3841 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 11,878 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.202 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు 3,216 క్యూసెక్కులు రాక

బోయినపల్లి, సెప్టెంబరు 6: మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి 2,200 వేలు మూలవాగు, మానేరు వాగు ద్వారా 1,016 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 316.215 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.144 టీఎంసీల మేర చేరుకుంది.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో



ఎల్ఎండీలో ఉన్న నీటి నిల్వలు

తిమ్మాపూర్, సెప్టెంబరు6: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు తగ్గాయి. ఎల్ఎండీలోకి ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 9,856 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండీ నుంచి 1,550క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మొత్తం 11,406 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీ లోకి వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో 294 క్యూసెక్కులు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.268 టీఎంసీలకు చేరుకున్నది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 95క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,300 రూపాయలు చెల్లించారు.

వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకోవాలి

సైదాపూర్, సెప్టెంబరు 6: విద్యుత్ వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకొని కరెంటు వాడుకోవాలని కరీంనగర్ ఎస్ఈ వి గంగాధర్ అన్నారు. గొడిశాల గ్రామంలో విద్యుత్‌శాఖ నిర్వహిస్తున్న నూతన కరెంటు మీటర్ల దరఖాస్తుల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వినియోగదారులకు తగు సూచనలు చేశారు. 500ల వోల్టేజ్ లోడు లోపు కరెంటు కనెక్షన్ కోసం రూ. 938 చెల్లించాలని చెప్పారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు జీరో బిల్లు నమోదు అవకాశాన్ని తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారందరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ బొమ్మ అంజనేయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని చెప్పారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లలోపు ఉండాలని తెలిపారు.

ధాన్యం టెండర్ల పరిశీలన

- రామగుండం సెక్టార్‌కు ఒకటే టెండర్
- సద్దుమణిగిన కాంట్రాక్టర్ల మధ్య వివాదం
- మాట్లాడిన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న అదనపు జేసీ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం రవాణా చేసేందుకు దాఖలైన టెండర్లను అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తెరిచారు. టెండర్ల దాఖలకు ఈనెల 5వ తేదీ చివరి తేదీ కాగా, పెద్దపల్లి సెక్టార్‌కు ఒకటి, సుల్తానాబాద్ సెక్టార్‌కు 2, మంథని సెక్టార్‌కు 2, రామగుండం సెక్టార్‌కు ఒక టెండర్ దాఖలయ్యింది. ఆ టెండర్లను అదనపు కలెక్టర్ కాంట్రాక్టర్ల సమక్షంలో తెరిచి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్లలో తక్కువ ధర కోట్ చేసిన వారిని ఈనెల 9వ తేదీన పిలుస్తామని చెప్పారు. గురువారం టెండర్ల సందర్భంగా రామగుండం సెక్టార్‌కు లక్ష్మన్ కుమార్ కాంట్రాక్టర్ దాఖలు చేసిన టెండర్ ఫారాన్ని రామగుండం లారీ ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు లాక్కోవడంతో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో టెండర్ ఫారాన్ని లాక్కువెళ్లిన వారిపై స్థానిక పోలీసులకు పౌరసరఫరాల సంస్థల జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు మరొక సెట్ అందజేయాలని లక్ష్మన్‌కుమార్‌కు అవకాశం కల్పించారు. టెండర్లు తెరిచే సమయానికి లక్ష్మన్ కుమార్ మరొక సెట్ దాఖలు చేయలేదు. ఆయనకు మొదట మద్దతుగా నిలిచిన పాలకుర్తి లారీ అసోసియేషన్‌కు చెందిన వాళ్లు రామగుండం లారీ అసోసియేషన్ వాళ్లతో కాంప్రమైజ్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన రామగుండం నియోజకవర్గ నేత జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగిందని సమాచారం.

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాలుర అండర్-15 హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు గోపాల్‌రావుపేట, కోహెడ, సిరిసిల్ల, కరీంనగర్, కోరుట్ల, జగిత్యాల, వెలిచాల, కొత్తపల్లి, గంగాధర, పెద్దపల్లి, జమ్మికుంట, హుస్నాబాద్, కాటారం ప్రాంతాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, హెచ్ఎం పద్మజ, పీహెచ్ఎస్ హెచ్ఎం రత్నాకర్ రెడ్డి మొదట క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.జిల్లా జట్టుకు ఎంపికైన ఆటగాళ్లు ఈ నెల 14,15వ తేదీల్లో హనుమకొండ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ స్వరూపరాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కాటారం కోచ్ మాల వెంకటేష్, సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ప్రేమ్‌కుమార్, పీడీ హను, పీఈటీలు అమర్, సాయి, శివాజీ, శ్రీకాంత్, కవిత, కనకలక్ష్మి, రాకేష్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సదస్సుకు తరలిరావాలి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ కోరారు. జమ్మికుంటలో శుక్రవారం చలో కరీంనగర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు మాదిగ ఉప కులాలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైస సాంబయ్య, రాచపల్లి వంశీకుమార్, పుల్యాల నరేష్, పోడేటి వేణు, సలిగంటి సతీష్, వడ్లూరి అరుణ్, కొలుగూరి రవీందర్, శనిగరపు యుగేందర్, దొగ్గల రవీందరర్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, కిష్టయ్య, శంకర్, భాస్కర్, రాజయ్య, ఓదెలు, శ్రీనివాస్, సతీష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్త అరెస్టు

- 14 రోజుల రిమాండ్
- జైలుకు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో దరుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడినందుకు కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టాణా సీఐ సరిలాల్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ చాంబర్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించిన మెండి చంద్రశేకర్ ఓ ఫైల్ గురించి అడుగుతూ తనను చేతులతో కొట్టి దుర్భాషలాడి, చంపేస్తానంటూ అసభ్యంగా ప్రవర్తించాడని టీపీఎస్ తేజశ్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తను ఫైల్‌ను తీస్తుండగా తన నుంచి బలవంతంగా ఫైల్ తీసుకుని కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తాను కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లగా తనను వెంబడించిన కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కమిషనర్‌ను కూడా దుర్భాషలాడాడని, విధులను ఆటంకించడంతో పాటు తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు టీపీఎస్ తేజశ్విని ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం రాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుని టాణాకు తరలించారు. శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6 : విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన మలగల సదానందం అలియాస్ ఆరెపల్లి సదయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి హేమంత్ తీర్పు వెలువరిస్తూ 15,169 రూపాయల జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించారని సీఐ తెలిపారు. అలాగే చొప్పదండి మండలం మల్లన్నపల్లి గ్రామపరిధిలోని కాట్నపల్లికి చెందిన బండారి యాదగిరికి విద్యుత్ చౌర్యం కేసులో కరీంనగర్ జిల్లా ఉప అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరిస్తూ 4,371 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్షను విధించారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఒడ్డెలింగాపూర్-భూపతిపూర్ మార్గ మధ్యలో శుక్రవారం కిష్టంపేట గ్రామానికి చెందిన దానవేణి పోచయ్య ద్విచక్ర వాహనం పై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. అటువగా వెళ్తున్న యువకులు జక్కుల సాగర్, బందెల స్వామి, నలువాల రాములు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

- నిందితుడిపై కేసు, రిమాండ్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి 3 సంవత్సరాలుగా శారీరకంగా కలిసి, రెండు సార్లు అబార్షన్ కూడా చేయించి చివరకు మోసం చేసిన ఘటనపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన ఒక యువతి (23)ని అదే గ్రామానికి చెందిన సూరజ్‌కుమార్ అనే యువకుడు ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడు. రెండు మార్లు 6 నెలల గర్భాన్ని తొలగింపజేశాడు. చివరకు పెళ్లి ప్రస్తావన తేవటంతో మొహం చాటేసి వివాహం చేసుకోనని చెప్పా డు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు సూరజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాయికల్ పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన షేక్ అల్మాస్, షేక్ హైదర్‌లు మహేంద్ర బొలెరో వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టుకున్న వాహనంతో పాటు 30 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. రేషన్ బియ్య ం తరలిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పొత్తూరు గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన పత్తి కళ్యాణ్ ఆటోలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఐదు క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు.



ఉప్పుమడుగు గ్రామంలో పట్టుకున్న రేషన్ బియ్యం

ఇంట్లోకి వెళ్లిన కోతులు

- గడియ పడడంతో కిటికీ ఊచలు తొలగించిన యజమాని



ఇంటిపై ఉన్న కోతులు(ఇన్‌సెట్‌లో ఇంట్లోకి దూరిన వానరం)

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి రెండు కోతులు ప్రవేశించాయి. అనంతరం తలుపులకు గడియ పడిపోవడంతో బయటకు రాలేకపోయాయి. ఆగ్రహంతో ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందర చేశాయి. సుమారు నాలుగు గంటల పాటు కోతులు ఇంట్లోనే ఉండిపోయాయి. గమనించిన ఇంటి యాజమాని కిటికీ ఊచలను తొలగిం చడంతో కోతులు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాయి. తీవ్ర ఆగ్రహంతో ఉన్న కోతులు తమను పై దాడి చేయకుండా కొబ్బరి చిప్పలు, అరిటి పండ్లు పెట్టడంతో వాటిని తీసుకొని బయటకు పరిగెత్తాయి. కాగా మండల కేంద్రంలో వానర సైన్యం బెంబెలెత్తించింది. పెద్ద సంఖ్యలో ఇళ్ల పరిసరాల్లో తిష్ట వేసి హంగామా సృష్టిస్తున్నాయి. ఇళ్లపైకి ఎక్కి పెంకులను తొలగిస్తున్నాయి. ఇళ్లల్లో ప్రవేశించి ఆహార వస్తువులు చిందరవందర చేస్తున్నాయి. అధికారులు కోతుల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

24 గంటలు 23 ఆపరేషన్లు

- వేములవాడ సర్కారు ఆస్పత్రిలో మరో రికార్డు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 6: ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయని పేద ప్రజల్లో నమ్మకం కలిగించే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రభుత్వ అనుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆపరేషన్లు చేస్తూ రికార్డులు నెలకొల్పుతున్నారు. గత నెల 24వ తేదీన 24 గంటల్లో 17 వివిధ రకాల ఆపరేషన్లు చేసి ఆదర్శంగా నిలిచారు. తాజాగా గురువారం నుంచి శుక్రవారం వరకు వేములవాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేశారు. వాటిలో పది సీజేరియన్ డెలివరీలు, రెండు గర్భసంచిలో గడ్డలు, ఐదు సాధారణ శస్త్ర చికిత్సలు, ఒకటి కంటి, ఐదు ఆర్థో ఆపరేషన్లు ఉన్నాయి. సూపరింటెండెంట్, సర్జన్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నమాల, డాక్టర్ అనిల్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ తిరుపతి ఇతర సిబ్బంది ఆపరేషన్లు చేసి ఏరియా ఆస్పత్రిపై నమ్మకాన్ని పెంచారు. 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేసిన సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బందిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.

క్రైం వార్తలు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు 6: మండలంలోని నల్లగొండ గ్రామంలో ఓ యువకుడు అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండి ఎస్సై వివేక్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ గ్రామానికి చెందిన నర్రేంకుల నరేష్(35)కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేష్ తన ఇంటి అవసరాల నిమిత్తం హిందుస్థాన్ మైక్రో ఫైనాన్స్ అనే సంస్థలో ఐదు లక్షల రూపాయలు హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. తీసుకున్న లోన్ తీర్చలేక ఇబ్బందులు పడుతున్న నరేష్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

మానకొండూర్/ కరీంనగర్ క్రైం సెప్టెంబరు 6: మండలంలోని నిజాయితీ గూడెం గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మూడు లీటర్ల నాటు సారా, 400 లీటర్ల నాటు సారాను తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం పానకం, 60కిలోల నల్ల బెల్లం, ఐకిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. కేశవపట్నం గ్రామానికి చెందిన కల్లూరి ఐలయ్య పై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ నాగేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ మోసీన్, ఖాసీం, కమలాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

వరద కాలువలో మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 6: గంగాధర మండలం ర్యాలపల్లి సమీపంలోని వరద కాలువలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం గుర్తించినట్లు ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ర్యాలపల్లి సమీపంలో వరద కాలువలో వ్యవసాయ పంపు సెట్టుకు మృతదేహం తట్టుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో యువకుడు మృతి చెంది ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపారు. కాలువ నుంచి శవాన్ని బయటకు తీశామని, అతని దుస్తుల్లో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మెట్‌పల్లికి చెందిన బొట్ల శ్రీనివాస్(35)గా గుర్తించామని తెలిపారు. ఇప్పటి వరకు శ్రీనివాస్ బంధువుల ఆచూకీ దొరకలేదని ఏఎస్ఐ చెప్పారు. వివరాలు తెలుసుకున్న అనంతరం పోస్టుమార్టం వరదకాలువ వద్దే నిర్వహించి మృతదేహాన్ని అప్పగిస్తామని ఏఎస్ఐ తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ నిర్లక్ష్యం

» మున్సిపల్ మురుగుకాల్వల్లోకి కెమికల్ వాటర్ » అమ్మోనియా వాసనతో గోదావరిఖని జనం అవస్థలు



ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ లెట్ నుంచి 7ఎల్ఈపీ డ్రైన్‌కు వస్తున్న వాటర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 6: ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ తన నిర్లక్ష్యాన్ని మరోమారు చాటుకుంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం కెమికల్ వాటర్‌ను శుద్ధి చేయకుండానే గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ఇప్పుడు కెమికల్ వాటర్‌ను మున్సిపల్ మురుగు కాల్వలోకి వదిలింది. గోదావరిఖని 7ఎల్ఈపీ, సంజయ్‌గాంధీనగర్ నాలాలకు కెమికల్ వాటర్‌వదిలారు. స్థానిక 7ఎల్ఈపీ గని పక్కనే ఉన్న పాత గ్లోబల్ వాషరీస్ వద్ద గల ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్‌లెట్ నుంచి, సంజయ్‌గాంధీనగర్ అవుట్‌లెట్ నుంచి శుక్రవారం రాత్రి 8గంటలకు పెద్ద ఎత్తున కెమికల్ వాటర్‌ను వదిలారు. దీంతో 7ఎల్ఈపీ కాలనీ, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్ ఏరియా పరిధిలోని మూడు డివిజన్ల ప్రజలు అతలాకుతలం అయ్యారు. సంజయ్‌గాంధీనగర్, ఒరియా కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, కాకతీయనగర్, కళ్యాణ్‌నగర్, ఉల్లిగడ్డల బజార్, గోదావరిఖని మార్కెట్ ఏరియా, సీతానగర్, లెనిన్‌నగర్ వాసులు వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యారు. వాటర్ నుంచి అమ్మోనియా గాలిలో కలుస్తుండడంతో కళ్లమంటలతో ఇబ్బందులు పడ్డారు. జనం ముఖానికి గుడ్డలు కట్టుకున్నారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ శ్రీహర్షకు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశంతో కమిషనర్ శ్రీకాంత్ డ్రైన్ల అవుట్ లెట్ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు.

ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై క్రిమినల్ చర్యలు

ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై ప్రజల పక్షాన క్రిమినల్ చర్యలకు వెనుకాడేది లేదు. వందల కోట్లు లాభాలు గడిస్తున్నా కనీసం రక్షణ ప్రమాణాలు పాటించడం లేదు. నిర్లక్ష్యంగా మున్సిపల్ మురుగు కాల్వలోకి కెమికల్ వాటర్ వదిలారు. ప్రజలు, చిన్నపిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్





విఠల్‌నగర్ డ్రైనేజీలో పారుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ నీరు, వాసన భరించలేక ముక్కుకు గుడ్డలు కట్టుకున్న స్థానికులు

అంజన్న హుండీ ఆదాయం రూ.81లక్షలు



సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, సెప్టెంబరు 6: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవ స్థానానికి హుండీల ద్వారా రూ.81, 07,641 నగదు ఆదాయం సమకూరి నట్లు ఈవో ఎం.రామకృష్ణరావు తెలిపారు. 56 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించగా నగదుతో పాటు 14గ్రాముల మిశ్రమ బంగారం, 4.900కిలోల మిశ్రమ వెండి, 61విదేశి కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ వేంకటఅన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలి

» తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 6: బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెడుతున్నారన్నారు. దీనితో రైతాంగానికి జీవనోపాధికి ముప్పుగా పరిణమించిందన్నారు. దేశంలో అధిక భాగం రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని కౌలు రైతులు ఉన్నారన్నారు. బడా వ్యాపారవేత్తల డిజిటలైజేషన్‌లో వీరిని కూడా చేర్చినట్లయితే మొత్తంగా వ్యవసాయ ఉత్పత్తులపై కార్పొరేట్ అధిపత్యం పెరిగి పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని డిమాండ్ చేశారు.

మేయర్ కక్షసాధింపు చర్యలతోనే తన భర్త అరెస్టు

- కార్పొరేటర్ మెండి శ్రీలత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: మేయర్ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేసు తన భర్తపై కేసు నమోదు చేసిన పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేశారని కార్పొరేటర్ మెండి శ్రీలత ఆరోపించారు. స్థానికంగా ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము మేయర్ సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని 20 రోజుల కిందట ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తప్పుడు ఫిర్యాదు చేయగానే గంటల వ్యవధిలో కేసు నమోదు చేసిన పోలీసులు తన భర్తను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి పాల్గొన్నారు.

రేపు జిల్లా జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6: జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 8న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనుస్‌పాష తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల 14 నుంచి 16వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు వినాయక చవితి వేడుకలు

భగత్‌నగర్/హుజూరాబాద్ సెప్టెంబరు 6: కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, హుజూరాబాద్‌లోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులుప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షయ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ చతుష్య, కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 6: నగరంలోని అక్షయ మహిళా డిగ్రీ కళాశాలలో స్నాతక్ స్వాగత్ 2024 బ్యూటిఫుల్ బిగినింగ్స్ ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ వి రవీందర్‌రెడ్డి, మనబయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చతుష్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చతుష్మ మాట్లాడుతూ డిగ్రీతో పాటు ఇంటర్న్‌షిప్ చేయడం వల్ల విద్యార్థి భవిష్యత్‌కు పునాది పడుతుందన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని పటిష్టమైన ప్రణాళిక ద్వారా గమ్యాన్ని చేరుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ వి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కళాశాలలో డిగ్రీతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, కాంపిటిటివ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థినులు నృత్యాలు, పాటలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర రోడ్ల దుస్థితిపై టీడీపీ ధర్నా

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 6: నగర రోడ్లు అధ్వాన్నంగా మారినా మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కల్యాడపు ఆగయ్య మాట్లాడారు. నగరంలోని ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వాటిని మరమ్మతు చేయాలని అసంపూర్తి పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు రొడ్డ శ్రీనివాస్, తీగుట్ల రమేశ్, ఎర్రోజు హయగ్రీవాచారి, ఇట్ల మల్లేశం, సందబోయిన రాజేశం, ఎర్రవెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్‌గౌడ్ నియామకంపై హర్షం

కరీంనగర్ అర్బన్/గణేశ్‌నగర్ సెప్టెంబరు 6: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వెలిచాల రాజేందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అర్బన్ బ్యాంక్ అసోసియేట్ అధ్యక్షుడు, గడ్డం విలాస్‌రెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్‌చైర్మన్ వెన్న రాజమల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు నగరంలోని ఇందిరాచౌక్ వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించాలని ర్యాలీ

హుజూరాబాద్, సెప్టెంబరు 6: హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దామని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. నేషనల్ గ్రీన్ కోర్ టీచర్ అనురాధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

హుజూరాబాద్, సెప్టెంబరు 6: పర్యావరణం కోసం మట్టి గణపతులను పూజించుదామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి వినాయకుల పంపిణీ

చొప్పదండి, సెప్టెంబరు 6: మండలంలోని కాట్నపల్లిలో 200 మందికి మట్టి గణపతులను గన్ను రాజిరెడ్డి అనే వ్యక్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడి, గన్ను శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం







మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్, సాహితి ఫౌండేషన్ దేషన్ బాధ్యులు, రావూస్ పాఠశాలలో మట్టి వినాయకులతో విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 6: పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి మట్టితో తయారు చేసిన విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్, మెప్మా పీడీ స్వరూపారాణి పాల్గొన్నారు.

● సాహితి ఫౌండేషన్ ఎన్జీవో కరీంనగర్ ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని వేదం విద్య సంస్థల ఆవరణలో సాహితీ ఫౌండేషన్ బాధ్యులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ చేశారు. సుమారుగా 1000 మట్టి గణపతులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవేదం విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్, స్వామి, జ్యోతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సాహితి ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎన్జీవోస్ భవన్ ఆవరణలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌చేతుల మీదుగా మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ చేశారు.

● అచీవర్స్ యాక్టివ్ స్కూల్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137ఎ సంయుక్తంగా వినాయక చవితి పురస్కరించుకుని, అచీవర్స్ పాఠశాలలో మట్టిగణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ చెర్మాల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, పల్లవి, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్ అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల అవగాహన ర్యాలీ, విగ్రహాల పంపిణీ చేపట్టారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి పాఠశాల వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సేవాసమితి ఉపాధ్యక్షుడు రాచమల్ల కిరణ్‌కుమార్ 150 విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాచమల్ల భద్రయ్య, పాల్తెపు శ్రీనివాస్, పాల్గొన్నారు. 35వ డివిజన్‌లో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో విగ్రహాలను పంపిణీ చేశారు. 3వ డివిజన్ కార్యాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఆర్పీ సభ్యులతో కలసి విగ్రహాలను పంపిణీ చేశారు. రావూస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్ రావు, సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపల్ రహమాన్ పాల్గొన్నారు. వీహెచ్‌పీ కార్యాలయంలో కార్పొరేటర్ కుర్ర తిరుపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మెహర్‌నగర్‌లోని వింధ్యావ్యాలీ పాఠశాలలో మట్టి విగ్రహాల పంపిణీని చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశరావు ప్రారంభించారు. పారమిత విద్యాసంస్థలో జరిగిన ముందస్తు వినాయక చవితి వేడుకల్లో చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు, రమణ, వియుఎం ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, సభ్యులు పాల్గొన్నారు.

నారాయణ ఫౌండేషన్ (స్వచ్ఛంద సంస్థ) ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్, ఫౌండేషన్ అధ్యక్షుడు కనపర్తి ప్రదీప్‌కుమార్, కార్యదర్శి బజ్జూరి భూమేశ్వర్ తదితరలు పాల్గొన్నారు.

భగత్‌నగర్: చింతకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీ తెలుగు వారి ఆధ్వర్యంలో మట్టి వినాయకులను తయారు చేసి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, చీఫ్ కో-ఆర్డినేటర్ నలుమాచు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం టి ఆనందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సైదాపూర్: సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్ పిన్సిపాల్ పర్హానా, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో విద్యార్థులు వినాయక చవితి పండుగ సందర్భంగా వివిధ ఆకృతుల్లో తయారు చేసిన మట్టి గణపతులను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ ఆదిత్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని ఊటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం గ్రామస్థులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. గ్రామంలో విద్యార్థులు ఇంటింటా తిరుగుతూ మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కోరారు.

మహిళలు 'శుక్రవారం సభ'ను వినియోగించుకోవాలి

కరీంనగర్ రూరల్/కరీంనగర్ టౌన్/హుజూరాబాద్‌రూరల్/ శంకరపట్నం/సైదాపూర్/వీణవంక/మానకొండూర్/తిమ్మాపూర్/గంగాధర సెప్టెంబరు 6: మహిళాలు శుక్రవారం సభలను వినియోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీవో కె మహేశ్వర్ సూచించారు. శుక్రవారం దుర్శేడ్‌లో నిర్వహించిన సభకు ఆయన హాజరై మహిళలకు సూచనలు చేశారు. కరీంనగర్‌లోని జయప్రకాశ్‌నగర్ కాలనీ ఏడబ్ల్యూసీలో శుక్రవారం సభ నిర్వహించగా 42వ డివిజన్ కార్పొరేటర్ మేచినేని వనజా అశోక్‌రావు హాజరై మాట్లాడారు. హుజూరాబాద్ మండలం కందుగుల, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, వీణవంక మండల కేంద్రం, మానకొండూర్ మండలం గంగిపల్లి, తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, ఇందిరానగర్, సంగంపల్లి, గంగాధర మండలం ఆచంపల్లిలో శుక్రవారం సభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వద్దేపల్లి కృష్ణ మృతిపై సంతాపం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 6: ఉమ్మడి జిల్లాకు చెందిన సినీ గేయ, లలిత గీతాల కవి, నృత్య నాటకాల రచయిత వద్దేపల్లి కృష్ణ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, కళాకారులు వేరువేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్, డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్, దాస్యం సేనాధిపతి, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, డాక్టర్ బీవీఎన్ స్వామి, డాక్టర్ డింగరి నరహరి ఆచార్య తదితరులు ఉన్నారు.

డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 6: పోలీసుశాఖలో పోస్టింగ్‌ల పేరిట తాను డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాలను నుంచి వైదొలుగుతానని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. శుక్రవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. సీఐ పోస్టింగ్ కోసం తాను 20 లక్షల రూపాయలు తీసుకున్నట్టుగా చేసిన ఆరోపణలను రుజువు చేయాలన్నారు. నిరూపించకపోతే ఇక ముందు తప్పుడు ఆరోపణలు చేయకుండా ఉండాలని, లేకుంటే తగిన శాస్తి తప్పదని ఆయన హెచ్చరించారు. ఓటమిని జీర్ణించుకోలేని బాలకిషన్ బట్టకాల్చి మీదేసే విధంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదోవపట్టిస్తున్నారన్నారు. వరదల వేళ తాను హైదరాబాద్‌కే పరిమితమైనట్టుగా రసమయి సాగించిన ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో తనకు ఎలాంటి వైరం లేదన్నారు. కమిషనరేట్ పరిధిలో దళిత సీఐ పోస్టింగ్‌ల విషయంలో సీపీ వైఖరిని మాత్రం తప్పుపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దళిత సామాజిక వర్గానికి చెందిన నలుగురు సీఐలను విధుల్లో చేర్చుకోకుండా సీపీ వెనక్కి పంపించారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రసమయి రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారిని సీఐగా నియమించుకోగా, ఇప్పుడు తాను దళిత సామాజికవర్గానికి చెందిన సీఐలు ఉండాలని కోరుకోవడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కల్లుతాగిన కోతిలా చిందులు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ వ్యవహారానికి ఫోన్ ట్యాంపింగ్‌ను ముడిపెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సమావేశంలో బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బెజ్జంకి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ ఊట్కూరి రమణారెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక



హుజూరాబాద్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూరాబాద్, సెప్టెంబరు 6: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో శుక్రవా రం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూలర్లు, వినియోగంలోని డ్రమ్ములు, ఇంటి చుట్టు పక్కల ఖాళీగా ఉన్న కొబ్బరి బొండాలలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ నీటి నిల్వ వలన దోమల లార్వాలు అభివృద్ధి చెంది ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు డెంగ్యూ, మలేరియా జ్వరాలు బారిన పడుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమా మహేశ్వర్, కమిషనర్ సమ్మయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, జవాన్లు రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ సత్యం, ఆశావర్కర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధర: ఎప్పటికప్పుడు గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించాలని జడ్పీ సీఈవో, గంగాధర మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హిమ్మత్‌నగర్‌లో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 6: గత ఏడాది జూలై నాటికి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేస్తూ పీఆర్సీ అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ వి రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడిగా పనిచేసిన సాంబయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంల రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, జిల్లా ప్రధాన కార్య దర్శి తూముల తిరుపతి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సదానందం, వేణు, సంపతి, రాములు, సమ్మిరెడ్డి, శ్రీధర్, రమణారెడ్డి, వెంకట్రాజం, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ప్రభాకర్‌రెడ్డి, రవి, మురళి పాల్గొన్నారు.

రజక సంఘం గ్రామ కార్యవర్గం

సైదాపూర్, సెప్టెంబరు 6: సైదాపూర్ గ్రామ రజక సంఘం పాలకవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మునిగంటి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా పున్నమి రామ్మూర్తి, కోశాదికారిగా మునిగంటి పెద్ద వెంకటేష్, సెక్రెటరీగా మునిగంటి చిన్న వెంకటేష్, గౌరవ అధ్యక్షుడిగా గోపిరాజు సమ్మయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజకొమురయ్య, రామచంద్రం, రాజయ్య, సంతోష్, చిన్న నర్సయ్య, కాసరాజు రమేష్, సమ్మయ్య, శంకర్, రాజు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏకగ్రీవం

వీణవంక, సెప్టెంబరు 6: మండలంలోని వల్భాపూర్ గ్రామంలోని శివాలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెబోయిన రాజ్ కూమార్, ఉపాధ్యక్షులుగా బావు రాకేష్, నలబాల రాకేష్, ప్రధాన కార్యదర్శిగా నలుబాల మధుకర్, వీరబోయిన సతీష్, బొంకూరి రవి ఎన్నికయ్యారు. సభ్యులుగా పోరెడ్డి తిరుపతి రెడ్డి, న్యాల రాజు, అందెకుమార్, తాటికంటి రంజిత్, న్యాలి కుమార్, వీరబోయిన రాజు గౌరవ అధ్యక్షుడిగా కలువల సదాశివరెడ్డిని ఎన్నుకున్నారు.

రసాభాసగా గ్రామసభ

రామడుగు, సెప్టెంబరు 6: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో హనుమాన్ ఆల య పునర్నిర్మాణంపై శుక్రవారం ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి పోలీసుల బందోబస్తు మధ్యలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. హనుమాన్ ఆలయ నిర్మాణంపై కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ఎంపీవో శ్రవన్‌కుమార్ శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చొప్పదండి సీఐ అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య గ్రామసభ ప్రారంభ మైంది. గ్రామస్థుల నుంచి సంతకాల సేకరణ చేసిన అనంతరం ఆలయానికి అనుకూలంగా ఉన్న వారు 117 మంది చేతులెత్తి మద్దతు పలికారు. వ్యతిరేకంగా ఎవరూ కూడా చేతులు ఎత్తలేదు. ఆ సమయంలో ఆలయ నిర్మాణాన్ని మాజీ సర్పంచ్ అడ్డుకోవద్దని చెబుతున్న క్రమంలో ఆమె తరపున వర్గీయులు, గ్రామస్థులు ఒక్కసారిగా లేచి పరస్పర వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు అందరిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం ఎంపీవో మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఎంతమంది సానుకూలంగా ఉన్నారో తెలుసుకునేందుకు ఈ సభను నిర్వహించినట్లు తెలిపారు. వ్యతిరేకంగా ఎవరూ లేరని తెలిపారు. ప్రసుత్తం ఇక్కడ ఉన్న పరిస్థితులను డీపీవోకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శేఖర్, గొల్లపల్లి అనూషలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనకు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మరమ్మతులు చేసిన కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్, సెప్టెంబరు 6: మండలంలోని లింగాపూర్-వెల్ది గ్రామాల మధ ఉన్న లోలెవల్ వంతెనకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోలెవల్ వంతెన కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 5న నాలుగు రోజులైనా పట్టించుకోరా అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. వెల్ది గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్పందించి శుక్రవారం ఎక్స్‌కావేటర్ సాయంతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని వంతెనపై పోసి చదును చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ననుమాల బాపురావు, సీనియర్ నాయకులు కనకం కొండయ్య, బత్తిని పరుశరాములు, పున్నం కొమురయ్య, పప్పు నవీన్, తాల్లపల్లి అనిల్, తుంగ హరీష్, నగునూరి లక్ష్మయ్య, పప్పు పవన్‌లు మరమ్మత్తు పనులు చేపట్టారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 6: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్, ఆపై విద్యనభ్యసిస్తున్న వికలాంగ విద్యార్థుల నుంచి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిపుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మహిళలు, వికలాంగులు, వయోవృద్ధులశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను కొత్తగా స్కాలర్‌షిప్‌లకు, రెన్యూవల్ చేసుకోవడానికి డిసెంబర్ 31వ తేదీ చివరి గడువు అని పేర్కొన్నారు అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఈశ్వర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 6: వీహెచ్‌పీ హిందూ ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షుడిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ తాటి ఈశ్వర్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. సుభాష్‌నగర్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రెండోసారి ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గో రక్షా విభాగ్ ప్రముఖ్ పుట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఆదిమూలం విద్యాసాగర్, గర్రెపల్లి ఆంజనేయులు, ఇనుగుర్తి రమేశ్, శ్రీనివాస సుదర్శన్, తోట రాజేందర్, జగదీశ్, గుజ్జేటి రాజేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 6: కరీంనగర్ మండలం గోపాల్ పూర్‌లో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవా రం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో విషజ్వరా లతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 60నుంచి 70మంది వరకు జ్వరపీడితులను పరీక్షించి, వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ మనోహర్,

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ క్రైం: కొత్తపల్లి పోలీసు ఠాణాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న టి ఐలయ్య శుక్రవారం పదవీ విరమణ పొందారు. కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా శుక్రవారం పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు.

● గణేశ్‌నగర్: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా అవా ర్డు పొందిన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా భూర్ల నరేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ పి నితిన్ అధ్యాపక బృందం సన్మానించారు.

- హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమంలో మొగ్దుంపూర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల కరీంనగర్ బాలురు-3 ప్రిన్సిపాల్ పోరాండ్ల చంద్రమోహన్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అందుకున్నారు.

● భగత్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంటలో గల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో నిర్మాణంలో ఉన్న భవనంలో క్లాసులు నిర్వహిస్తున్నారని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటిరాణా ప్రతాప్ డీఈవోకు వినతిపత్రం అందించారు. నిర్మాణం పూర్తి కాకుండానే క్లాసులు, హాస్టల్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

- కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మల అంజయ్య, భైరి వంశీలు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.

- లయన్స్ క్లబ్ ఆఫ్ భగత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఓరుగంటి తిరుపతిని క్లబ్ అధ్యక్షుడు సిరిపురం ప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి రామచంద్రం, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ వెన్నం రాజిరెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పీఈటీగా పనిచేస్తున్న గోలి నరేందర్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఎంపిక చేసింది. నరేందర్‌ను డీఈవో జనార్దన్‌రావు, పాఠశాల చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ కుమారస్వామి అభినందించారు.

● తిమ్మాపూర్: శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడిగా విధుల నిర్వర్తిస్తున్న కొలుపుల రాంప్రసాద్‌కు రాజస్థాన్ రాష్ట్రం కోటాలో ఉన్న కెరీర్ పాయింట్ యూనివర్సిటీ ఫార్మసీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకోవడంతో శుక్రవారం శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

● జమ్మికుంట: పరిధిలోని ఆబాది జమ్మికుంట, హనుమాండ్లపల్లి, గణేష్‌నగర్, కొత్తపల్లిలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

- తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకం అయిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి కలిసి సన్మానించారు

- పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గల కార్గో ఆఫీస్ ఎదుట పెట్టిన కారు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 4న ఎత్తుకెళ్లారని ఇన్‌చార్జి బంగారి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

- ముఖ్యమంత్రి సహాయనిధికి జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం పీఏసీఎస్ చైర్మన్ కటంగూరి శ్రీకాంత్‌రెడ్డి కుమారుడు విశ్వతేజరెడ్డి శుక్రవారం ఐదు వేల రూపాయల విరాళం ఆందజేశాడు.

● జమ్మికుంట రూరల్: ఎస్సీ గురుకులాల నుంచి తొలగించిన ఔట్‌సోర్సింగ్ పార్ట్ టైమ్ ఉద్యోగ, ఉపాధ్యాయులను తీసుకోవాలని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షు డు అంబాల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● గంగాధర: గంగాధర ప్రెస్ క్లబ్ నిర్మాణ స్థలాన్ని శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ తిరుపతి, పీఆర్ ఏఈ రమేశ్ పరిశీలించారు.

- భారీ వర్షాలతో ఖమ్మం, నల్లగొండ జిల్లాలో ప్రాణ నష్టం జరిగితే వారం రోజులకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి బండి సంజయ్ అక్కడ పర్యటించడం బురద రాజకీయమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో విమర్శించారు.

● గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు 71 కోట్ల నిధులతో ప్రారంభమైన డబుల్ రోడ్డు నిర్మాణ పనుల సీపీఐ నాయకులు పరిశీలించారు.

- మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌పై అటెండర్‌గా పని చేస్తున్న లక్ష్మిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు శుక్రవారం డీఆర్‌డీవో పీడీకి ఫిర్యాదు చేశారు.

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరక్టర్‌గా మండలంలోని పారువెల్లకు చెందిన నుస్తులాపూర్ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అలువాల కోటి నియామకమయ్యారు.

- గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవా లని ఎస్‌ఐ తాండ్ర నరేష్ అన్నారు. మండల కేంద్రం లోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

● రామడుగు: రామడుగు ఎస్‌ఐగా శేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేందర్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు.